సాక్షి అనకాపల్లి

7

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



➤ కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన సన్నిధి మినరల్స్ టిప్పరు రాంబిల్లి మండలం కొండవారపాలెం గ్రామం వద్ద శుక్రవారం ఉదయం జార విడిచిన బండరాళ్లు ఇవి. వెనుక ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధిక లోడుతో ప్రమాదకర రాళ్లతో ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోకుండా అంత నిర్లక్ష్యంగా ఇష్టారాజ్యంగా వెళ్లడానికి వారికి ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?



➤ ఈ ఏడాది మార్చి 16వ తేదీన మునగపాకకు చెందిన టీడీపీ కార్యకర్త, ఎల్ఐసీ ఏజెంట్ గన్నారావు మైనింగ్ టిప్పరు గుద్ది ప్రాణాలు కోల్పోయారు. కంటితుడుపుగా కేసు పెట్టడం మినహా రోజువారీగా అక్రమ మైనింగ్, అధిక లోడు వాహనాల విషయంలో తనిఖీలు మాత్రం జరగడం లేదు.



➤ ఈ ఏడాది మార్చి 25న అనకాపల్లి టౌన్‌లో విజయరామరాజు పేట వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జి గడ్డర్‌ను క్వారీ లారీ ఢీకొనడంతో భారీ ప్రమాదం తప్పింది. దీంతో రైల్వే గడ్డర్ పాక్షికంగా దెబ్బతింది.





➤ అక్రమ మైనింగ్ కోసం అనకాపల్లి మండలం పాపయ్యసంతపాలెం వద్ద మైనింగ్ మాఫియా వేసుకున్న రహదారి. ఎటువంటి అనుమతి లేకున్నా రోడ్డు నిర్మిస్తుంటే... గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే తప్ప అటువైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

➤ ఇవే కాదు ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్‌కు అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ అటు మైనింగ్ అధికారులు కానీ... ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు గానీ చర్యలు తీసుకునేందుకు ప్రయత్నించడం లేదు. ప్రతి నెలా ఆయా విభాగాలకు తంచనుగా మామూళ్లు అందుతుండటమే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా కూటమి నేతల ధనదాహం, అధికారుల అలసత్వం వెరసి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటోంది.



అందరూ దోషులే!

- ➡ అక్రమ మైనింగ్‌కు కొమ్ముకాస్తున్న అధికారులు
- ➡ కూటమి నేతల ధనదాహానికి ప్రజల ప్రాణాలు హరి
- ➡ భారీ రాళ్ల తరలింపుతో రోడ్లు ఛిద్రం
- ➡ పక్క జిల్లా నుంచి వస్తున్నా పట్టించుకునే వారేరీ
- ➡ మైనింగ్, పోలీసు, రవాణా అధికారులకు భారీగా ముడుపులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అనకాపల్లి జిల్లా మైనింగ్ అవకతవకలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. శుక్రవారంనాటి తాజా సంఘటననే ఇందుకు ఉదాహరణ. వాస్తవానికి రాంబిల్లి మండలంలోని కొండవారపాలెం వద్ద రెండు బండరాళ్లను విడిచిన టిప్పర్లు పక్క జిల్లా కాకినాడ నుంచి వస్తున్నాయి. తుని, పాయకరావుపేట, నక్కపల్లి, యలమంచిలి నియోజకవర్గాలను దాటుకుని రాంబిల్లి వద్ద జరుగుతున్న నావికాదళ పనుల కోసం ఈ బండరాళ్లను తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని పోలీసు, రవాణా, మైనింగ్ అధికారులు తనిఖీలు జరిపితే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించే వీలుంటుంది. ప్రతి రోజూ పక్క జిల్లా నుంచి పదుల సంఖ్యలో అధిక లోడుతో టిప్పర్లు వస్తున్నప్పటికీ ఆయా స్టేషన్ల పరిధిలోని పోలీసు, రవాణా శాఖల సిబ్బంది పట్టించుకోవడం లేదు. ప్రతి నెలా భారీగా అందుతున్న మామూళ్లే ఇందుకు కారణమని వేరే చెప్పనక్కరలేదు.

అధిక లోడుతో చక్కర్లు...!

అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌తో టిప్పర్లు అధికలోడుతో వెళుతున్నాయి. తద్వారా రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. ఇప్పటికే అనేకసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి. కొంత మంది ప్రాణాలను కూడా బలితీసుకున్నాయి. అనకాపల్లి నియోజకవర్గంలో ఉన్న వివిధ క్వారీల ద్వారా రోజువారీ 1,000 ట్రిప్పుల బండరాళ్లను మునగపాక మీదుగా రోడ్లపై భారీ శబ్దాలు చేస్తూ రాంబిల్లిలోని నావికాదళ పనుల కోసం తరలిస్తున్నారు. 32-36 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్లల్లో ఏకంగా 50 టన్నుల మేరకు భారీ బండరాళ్లు వేసుకుని తిరుగుతున్నా అటు మైనింగ్ అధికారులు కానీ, ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు కానీ కనీసం కన్నెత్తి చూడటం లేదు.

అక్రమ సంపాదన నెలకు రూ.2 కోట్లు

ఒక్కో ట్రిప్పునకు నెలకు రూ.22 వేల చొప్పున కూటమి నేతలు ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో నెలవారీ వసూలవుతున్న మొత్తం రూ.2 కోట్లకు పైమాటే. కూటమి నేతలతోపాటు మైనింగ్, రవాణా, పోలీసు, రెవెన్యూ అధికారులకూ భారీగా వాటాలు అందుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రవాణాశాఖ అధికారులు అధిక లోడుతో వెళుతున్న వాహనాలను చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు. అనధికారిక క్వారీల్లో జరుగుతున్న మైనింగ్‌ను పట్టించుకోకుండా ఉండేందుకు గానూ మైనింగ్ అధికారులకూ భారీగా ముడుతోందన్న విమర్శలున్నాయి. అక్రమ మైనింగ్‌తో పాటు అధిక లోడుతో భారీగా రాయల్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. ఇక మైనింగ్ విజిలెన్స్ అధికారులు కనీసం ఒక్కటంటే ఒక్కసారి కూడా దాడులు చేసి అక్రమ మైనింగ్‌ను నిలిపివేసేందుకు గత 6 నెలల కాలంలో ప్రయత్నించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు స్థానిక పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్ ఇలా అన్ని విభాగాల అధికారులకు వాటాల లెక్కన పంచుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాలన్నీ కూటమి నేత బంధువు దగ్గరుండీ మరీ చూస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరి వాటా వారికి ఇచ్చిన తర్వాత మిగిలిన మొత్తం భారీ స్థాయిలో సదరు కూటమి నేత బంధువు జేబులోకి వెళుతోంది.



టిప్పర్ లారీల తాకిడితో శిథిలమైన రోడ్డు

నేరుగా వాయిస్ మెసేజ్‌లు ఉన్నా...

"ఈ నెల 10వ తేదీ లోగా నా వద్దకు వచ్చి... కన్ఫర్మ్ చేసుకోండి. 10వ తేదీన జాబితా సిద్ధమవుతుంది. 11వ తేదీ నుంచి ఎవరైనా పట్టుకుంటే నాకు సం బంధం లేదు. ఫోన్ పేలు ఎవ్వరూ చేయవద్దు'' ఇది అనకాపల్లి జిల్లాలో అధిక లోడుతో వెళుతున్న, అనుమతి లేని వాహనాల విషయంలో వసూళ్లకు సంబంధించిన ఆడియో మెసేజ్. ఈ ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అసలు ఏ శాఖకు సంబంధం లేని ఒక ప్రైవేటు వ్యక్తి ధైర్యంగా ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలకు ఆడియో మెసేజ్‌లు పంపి వసూళ్లకు తెగబడుతున్నాడంటే... సదరు వ్యక్తికి ఎంతమేర అధికారుల నుంచి అండదండ ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ప్రతి నెలా లారీకి ఇంత చొప్పున అటు మైనింగ్, ఇటు ఫ్లై యాష్.... అంతేకాకుండా సెజ్‌లకు వెళ్లే బస్సుల యాజమాన్యాలు రవాణాశాఖ అధికారులకు పైకం చెల్లించాలి. లేని పక్షంలో దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ఈ వ్యవహారమంతా ఒక ప్రైవేటు వ్యక్తి ద్వారా రవాణాశాఖ అధికారులు నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి.

బండరాళ్ల టిప్పర్‌తో భయోత్పాతం...



సాక్షి, అనకాపల్లి: వాహనచోదకులకు ఘోర ప్రమాదం తప్పింది. రాంబిల్లి మండలంలోని కొండవారపాలెం వద్ద నేవల్‌బేస్‌కు తరలిస్తున్న బండరాళ్ల లారీ నుంచి రెండు పెద్ద రాళ్లు అకస్మాత్తుగా రోడ్డుపైకి పడ్డాయి. శుక్రవారం ఉదయం 9:30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన స్థానికులను బెంబేలెత్తించింది. ఇటీవల కాలంలో జిల్లాలోని పలు క్వారీల నుంచి బండరాళ్ల లోడుతో కూడిన లారీలు నేవల్‌బేస్‌కు ప్రమాదకర రీతిలో వెళ్తున్నప్పటికీ పలు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం టిప్పర్ లారీపై నుంచి కొండవారపాలెం వద్ద భారీ రాళ్లు రోడ్డుపై పడ్డాయి. అదృష్టవశాత్తూ వాహనచోదకులకు ప్రమాదం తప్పింది. రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన టిప్పర్ డ్రైవర్ దమ్ము శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి చర్యల్లో భాగంగా ఆర్‌టీఏ అధికారులకు సిఫారసు చేశారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఏయూ రిజిస్ట్రార్ మొన్నటివరకు నివసించిన బంగ్లా. ఇప్పుడు ప్రస్తుత వీసీ రాజశేఖర్ నివాసం ఉంటున్నారు. తాను నివాసం ఉండేందుకు వీలుగా వీసీ ఏకంగా రూ.64 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించుకున్నారు. అయితే డాక్టర్ క్వార్టర్ మరమ్మతులకు రూ.లక్ష మంజూరు చేసేందుకు మాత్రం ససేమిరా అంటూ వీసీ మోకాలడ్డారు. ఏయూ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడానికి ఇదే కారణంగా తెలుస్తోంది. విద్యార్థి మరణం నేపథ్యంలో వీసీ వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వీసీ బంగ్లాకు రూ.64 లక్షలతో మరమ్మతులు

డాక్టర్ క్వార్టర్‌కు రూ.లక్ష లేదట

డాక్టర్ అందుబాటులో లేకపోవడానికి ఇదే కారణం

ఫైల్‌ను ఆరు సార్లు పంపినా పట్టించుకోని ఏయూ వీసీ

విద్యార్థి మరణం నేపథ్యంలో వీసీ వైఖరిపై విమర్శల వెల్లువ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

తాను ఉండేందుకు రిజిస్ట్రార్ బంగ్లాను రూ.64 లక్షలతో మరమ్మతులు చేయించుకున్న ఏయూ వీసీ రాజశేఖర్.. ఏయూ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్ నివాసం ఉండేందుకు లక్ష రూపాయలతో క్వార్టర్‌లో మరమ్మతులు చేయించాలని కోరినా పట్టించుకోకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. విద్యార్థి మరణంపై విద్యార్థులు ఇంత తీవ్రస్థాయిలో స్పందించేందుకూ వీసీ వైఖరే ప్రధాన కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి వీసీ తన బంగ్లాలో ఉందామనుకుని.. ఐటీ నుంచి ప్రత్యేక టీమ్‌తో మరమ్మతులు చేయించుకునేందుకు యత్నించినట్టు తెలుస్తోంది. అయితే ఈ బంగ్లా నివసించేందుకు అంతగా అవకాశం లేదని తేల్చిచెప్పడంతో రిజిస్ట్రార్ బంగ్లాలో నివాసం ఉండాలని వీసీ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అనుకున్న వెంటనే ఈ బంగ్లాలో మరమ్మతుల పేరిట భారీగా వెచ్చించేందుకు సమాయత్తం కావడంతో పాటు ఇప్పటికే రూ. 64 లక్షల మేర ఖర్చు చేసినట్టు సమాచారం. ఒకవైపు తన బంగ్లా కోసం లక్షలకు లక్షలు తగలేస్తున్న వీసీ... డాక్టర్ కోసం క్వార్టర్ మరమ్మతుకు రూ.లక్ష ఖర్చు ఎందుకు చేయలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏకంగా ఆరుసార్లు ఫైలును పంపినప్పటికీ తిప్పిపంపడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ఏయూలో చోటుచేసుకుంటున్న ప్రస్తుత వివాదాలను ఉద్దేశపూర్వకంగా సృష్టిస్తున్నవన్న మంత్రి లోకేష్ వ్యాఖ్యలను విద్యార్థులు తప్పుపడుతున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా విద్యార్థులపై నెపం నెట్టడాన్ని విద్యార్థులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

వీసీ వైఖరితోనే..!

శాతావాహన హాస్టల్‌లో ఉంటున్న బీఈడీ రెండో సంవత్సరం విద్యార్థి మణికంఠ గురువారం ఆకస్మికంగా మరణించారు. ఊపిరి తీసుకోలేక అస్వస్థతకు గురికాగా.. సరైన వైద్యం అందించకపోవడంతోనే తమ మిత్రుడు మరణించాడంటూ సహచర విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలు శుక్రవారం కూడా కొనసాగాయి. తమ ప్రాణాలకు విలువలేకుండా పోయిందని విద్యార్థులు మండిపడుతున్నారు. అంతేకాకుండా ఏయూ ఆరోగ్య కేంద్రంలో సరైన సౌకర్యాలు లేవని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ కనీసం ఆక్సిజన్ పెట్టేవారు కూడా లేరని వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడ ఉండే డాక్టర్ 24 గంటలు అందుబాటులో ఉండేందుకు వీలుగా క్వార్టర్ కేటాయించాలని అధికారులు భావించారు. ఇందుకోసం ఒక క్వార్టర్‌లో రూ.లక్ష వెచ్చించి మరమ్మతులు జరిపితే అక్కడ నివసించేందుకు అనువుగా ఉంటుందని భావించి ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలుస్తోంది. అయితే, దీనిని కనీసం వీసీ పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఈ ఫైలును కనీసం 6 సార్లు వీసీ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే డాక్టరు అందుబాటులో లేకుండా పోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ డాక్టరు అందుబాటులో ఉంటే... విద్యార్థి మణికంఠ ఏయూ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వెంటనే ఆక్సిజన్ అందించడంతో పాటు అంబులెన్స్‌లో జాగ్రత్తగా తరలించే వీలు కలిగేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా సొంత భవంతికి లక్షలకు లక్షలు ఖర్చు చేసి సొబగులు అద్దుకుంటున్న వీసీ.. డాక్టర్ కోసం క్వార్టర్ మరమ్మతుకు రూ.లక్ష ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్నలు వెంటాడుతున్నాయి. మొత్తంగా వీసీ వ్యవహార శైలితో ఇప్పటికే ఏయూ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. ఇప్పుడు ఏకంగా విద్యార్థుల ప్రాణాలకు కూడా సమస్యగా మారిందనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

వరుసగా వివాదాలు..!

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏయూలో వ్యవహారాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఒక ప్రైవేటు విద్యా సంస్థకు మేలు చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏయూలో నియమితులైన అధికారులందరూ సదరు ప్రైవేటు సంస్థలో గతంలో పనిచేయడమూ ఇందుకు కారణం. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు అర్ధ రాత్రి సమయంలో రోడ్డు మీదకు వచ్చి నిరసనలు తెలుపుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అన్నం సరిగ్గా లేదని ఒకసారి... కనీస సౌకర్యాలు లేవని మరోసారి.. నియామకాల్లో అన్యాయం జరుగుతోందంటూ ఇంకోసారి ఇలా వరుస వివాదాల్లో కూరుకుపోతోంది. తాజాగా విద్యార్థి మరణించిన సంఘటనతో ఇన్నాళ్లుగా వ్యక్తమవుతున్న ఆందోళన కాస్తా.. ఆగ్రహంగా మారిపోయింది. ఏకంగా తమ ప్రాణాలనే బలితీసుకునేందుకూ వెనుకాడటం లేదన్న ఆవేశం విద్యార్థుల్లో కట్టలు తెంచుకుంది. వాస్తవానికి గతంలో కోవిడ్ సమయంలోనూ ఏయూలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించారు. ఏకంగా 600 మంది విద్యార్థులకు ప్రత్యేక గదులను కేటాయించడంతో పాటు క్వారంటైన్ ముగిసిన తర్వాత వారి తల్లిదండ్రులకు జాగ్రత్తగా అప్పటి వీసీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో అప్పగించారు. అదేవిధంగా కోవిడ్ సమయంలో ప్రయాణానికి అనుమతి లేని 500 మంది విదేశీ విద్యార్థులకు టీకాలు లభించని సమయంలో కూడా టీకాలు వేయించి మరీ వారి ప్రాణాలకు భరోసా కల్పించే ప్రయత్నం జరిగింది. ఇప్పుడు ఆరోగ్యం బాగోలేదని వచ్చిన విద్యార్థికి సమయానికి ఆక్సిజన్ అందించి కాపాడుకోలేని దీనస్థితికి ఏయూను పాలకులు దిగజార్చారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అన్నంలో పురుగులు వచ్చాయని విద్యార్థుల ఆందోళన (ఫైల్)

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కమిటీలో పలువురికి చోటు

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా కమిటీలో పలువురికి చోటు కల్పించారు. జిల్లా సెక్రెటరీలుగా గంటా లలిత, బేతిరెడ్డి రత్నం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శెట్టి సత్య, లోకవరపు శారద, మాకిరెడ్డి విజయలక్ష్మి, కామిరెడ్డి లక్ష్మిలను నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నయ్య కంటే చంద్రబాబే ఎక్కువయ్యారా?

- చిరంజీవిపై అసెంబ్లీలో బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు
- స్పందించడంలో పవన్ మౌనం ఎందుకు?
- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదు
- అహంకారపూరిత వ్యాఖ్యలను బాలకృష్ణ ఉపసంహరించుకోవాలి
- బూడి ముత్యాలనాయుడు, బొడ్డేడ ప్రసాద్ డిమాండ్



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ, పార్టీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ

దేవరాపల్లి/మునగపాక: అసెంబ్లీ సాక్షిగా చిరంజీవిపై టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దారుణమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు, పార్టీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ విమర్శించారు. సొంత అన్నయ్యను వాడు.. వీడు అంటూ బాలకృష్ణ చులకనగా మాట్లాడినా పవన్ కల్యాణ్ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవడంలో మర్మమేంటని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, కేంద్ర మాజీమంత్రి చిరంజీవిపై అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ముత్యాలనాయుడు.. బొడ్డేడ ప్రసాద్, పార్టీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధలతో కలిసి తారువలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మునగపాకలో కూడా బాలకృష్ణ వ్యాఖ్యలను ఖండించారు. 'ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో మానసిక స్థితి సరిగా లేని వ్యక్తితో అమర్యాదకరంగా మాట్లాడించి సభా ప్రతిష్టకు భంగం కలిగించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో వీధిరౌడీలా చొక్కా గుండీలు విప్పుకుని, నెత్తి మీద కళ్లజోడు పెట్టుకుని, రెండు చేతులు జేబుల్లో పెట్టుకుని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, చిరంజీవిని కించపరిచేలా మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలంతా చూశారు.' అని అన్నారు. కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, మంత్రులు, డిప్యూటీ స్పీకర్ సైతం బాలకృష్ణ వ్యాఖ్యలను ప్రోత్సహించేలా ప్రవర్తించారే తప్ప ఒక్కరూ ఖండించలేదని మండిపడ్డారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించకపోవడం చూస్తుంటే.. ఆయనకు అన్నయ్య కంటే చంద్రబాబే ముఖ్యమైనట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు గౌరవప్రదంగా నడుచుకోవాలని, బాలకృష్ణ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, చిరంజీవికి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 2004లో స్నేహితులపై బాలకృష్ణ తన ఇంట్లో తుపాకీతో కాల్పులకు తెగబడిన ఘటనను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. మానసిక పరిస్థితి బాగోలేదని మెడికల్ సర్టిఫికెట్ తెచ్చుకున్నది నీవే కదా అంటూ నిప్పులు చెరిగారు.

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

తుమ్మపాల: జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్న కారణంగా తాగునీరు సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయం నుంచి మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా పైపులు లీకేజీలు లేకుండా, మంచినీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రతి రోజు క్లోరినేషను చేయాలన్నారు. ప్రైవేటు ఆర్వో. వాటర్ యూనిట్లను కూడా తనిఖీ చేయాలన్నారు. డయేరియా రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు 08924222888, 08924225999, 08924226599 కు ఫోన్ చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ (డీసీసీ), బ్యాంకు రుణాలపై జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్‌సీ) త్రైమాసిక సమావేశంలో ఆమె మాట్లాడుతూ కౌలు రైతులకు, సూర్యఘర్ సోలార్ రూఫ్‌టాప్‌కు, పరిశ్రమలకు, వ్యవసాయ, డెయిరీ, పౌల్ట్రీ, ఉపాధి రంగాలకు, స్వయం సహాయక బృందలకు వేగంగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు ఆదేశించారు. యూనియన్ బ్యాంక్ ఉప ప్రాంతీయ మేనేజర్ శ్రీవాసరావు, ఆర్‌బీఐ ఎల్డీవో రాజేష్ కుమార్ కుంద్, నాబార్డ్ డీడీఎం సమంత్ కుమార్, డైరెక్టర్ ఎస్బిఐ రాజేశ్వరరావు, డిఆర్డిఏ పిడి కె.శచీదేవి, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీ సంస్కరణలపై విస్తృత ప్రచారం



కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జీఎస్‌టీ సంస్కరణలు, వాటి ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులు, మండల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. నాలుగు శ్లాబ్‌లున్న జీఎస్‌టీ పన్ను విధానాన్ని రెండు శ్లాబ్‌లకు కుదించినట్టు తెలిపారు. 12 శాతం శ్లాబ్‌లో ఉన్న 99 శాతం వస్తువులు, సేవలను 5 శాతానికి తగ్గించినట్టు చెప్పారు. 28 శాతం శ్లాబ్‌లో గల 90 శాతం వస్తువులు,సేవలను 18 శాతానికి తగ్గించినట్టు ఆమె తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 19 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎగ్జిబిషన్లు, ర్యాలీలు, మేళాలు, మండల, గ్రామస్థాయిలో సభలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎం. జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి రాజీవ్‌గాంధీ అనే యువకుడు తనను మోసం చేశాడని ఓ యువతి అనకాపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి పట్టణ సీఐ విజయ్ కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చోడవరం మండలం లక్కవరం గ్రామానికి చెందిన దొమ్మేటి సరూన్‌కు చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన కుంచెల రాజీవ్‌గాంధీతో 2021లో పెళ్లి చూపులు జరిగాయి. అయితే యువతి తండ్రికి ఇష్టం లేకపోవడంతో పెళ్లి జరగలేదు. అప్పటి నుంచి సరూన్‌తో రాజీవ్ గాంధీ పరిచయం పెంచుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అనకాపల్లిలోని చినబాబు కాలనీలో ఉన్న తన అక్క ఇంటికి సరూన్‌ను తీసుకువెళ్లి శారీరంగా లోబరుచుకున్నాడు. అప్పటి నుంచి పెళ్లి చేసుకోమని కోరుతున్నా వివిధ కారణాలతో దాటవేస్తున్నాడని, రాజీవ్ గాంధీతో పాటు అతని అక్క, బావ, తమ్ముడులు కూడా పెళ్లి చేస్తామని తనను మోసం చేశారని సరూన్ ఫిర్యాదులో పేర్కొన్నట్టు సీఐ తెలిపారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

గంటల్లోనే తల్లిదండ్రులకు అప్పగింత

చోడవరం: బాలిక అదృశ్యం కేసును చోడవరం పోలీసులు వెంటనే ఛేదించారు. ఆమెను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. అనంతగిరి మండలానికి చెందిన బాలిక చోడవరం పట్టణంలోని ఎస్టీ కాలేజీ హాస్టల్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. సెలవులు కావడంతో గురువారం సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికని బయలు దేరింది. అప్పటి నుంచి ఆ బాలిక కనిపించకపోవడంతో తండ్రి చిక్కయ్య చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ అప్పలరాజు పర్యవేక్షణలో ఎస్ఐ నాగకార్తీక్ తన సిబ్బందితో బాలిక ఆచూకీ కోసం వెతికారు. బాలిక మాకవరపాలెం వద్ద కనిపించడంతో వెంటనే పోలీసులు పట్టుకొని చోడవరం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. వివరాలు తెలుసుకొని తహసీల్దార్ రామారావు సమక్షంలో బాలికను తల్లిదండ్రులకు శుక్రవారం అప్పగించినట్టు ఎస్ఐ నాగకార్తీక్ చెప్పారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వాడ్రాపల్లిలో పర్యటిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి తెలిపారు. మండలంలోని వాడ్రాపల్లిలో శుక్రవారం ఆయన పర్యటించారు. రక్షితమంచినీటి పథకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఎంపీడీవో ఎం.ఉషారాణి,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస తదితరులు పాల్గొన్నారు.

మిట్టల్-నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌పై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

నక్కపల్లి: ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఏపీ కాలుష్యనియంత్రణ మండలి చందనాడ సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. జపాన్‌కు చెందిన ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కార్పొరేషన్ జాయింట్ వెంచర్‌తో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. రాజయ్యపేట, చందనాడ, డీఎల్ పురం, వేంపాడు, అమలాపురం, మూలపర గ్రామాల పరిధిలో పోర్టు ఆధారిత ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు. గత ఏడాది చివరలో ప్రభుత్వం రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో సుమారు 2,200 ఎకరాలు స్టీల్‌ప్లాంట్‌కు కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. టౌన్‌షిప్ అభివృద్ధి కోసం మరో 440 ఎకరాలు కేటాయించాలని మిట్టల్ గ్రూపు ప్రభుత్వాన్ని కోరింది. ఏడాదికి 7.30 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ కంపెనీ ఏర్పాటు చేయబోతోంది. రెండోదశలో 10.5మిలియన్‌మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేయబోయే స్టీల్‌ప్లాంట్ కోసం మరో 3,800 ఎకరాలను కేటాయించాలని కంపెనీ ప్రభుత్వాన్ని కోరింది.మొదటిదశ 2029 నాటికి, రెండోదశ 2033 నాటికి పూర్తిచేయాలనేది నిర్ణయం. మొదటి దశలో 20 వేల మందికి, రెండో దశలో 35 వేల మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. మొదటి దశ ప్రాజెక్టు కోసం భూముల కేటాయింపుపూర్తయింది. స్టీల్ ప్లాంట్ అవసరాల కోసం ఏలేరు కాలువ నీటిని ఉపయోగిస్తారు. రోడ్డు, పైపు లైన్ల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సరుకు రవాణా , ముడిసరుకు ఎగుమతులు దిగుమతుల కోసం రూ.100 కోట్ల వ్యయంతో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటు చేయనుంది. ఏపి ట్రాన్స్‌కో ద్వారా రాయితీపై విద్యుత్ సరఫరా చేయనుంది. ఇక తమ్మయ్యపేటనుంచి కాగిత, చినదొడ్డిగల్లు మీదుగా గుల్లిపాడు రైల్వేస్టేషన్ వరకు కొత్త రైల్వే లైను ఏర్పాటు చేసేందుకు సర్వే జరుగుతోంది. స్టీల్‌ప్లాంట్ అవసరాల కోసమంటూ రాష్ట్ర ప్రభుత్వం కాగిత, నెల్లిపూడి,డీఎల్‌పురం, వేంపాడు గ్రామాల్లో మరో 2,500 ఎకరాలు భూసేకరణకు సన్నాహాలు చేస్తోంది. దీనిపై ఆయా గ్రామాలప్రజల్లో ఆందోళన, అనుమానాలు నెలకొన్నాయి. డిమాండ్లకు అనుగుణంగా నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.



ప్రజాభిప్రాయ సేకరణ కోసం జరుగుతున్న ఏర్పాట్లు

స్థానికులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్

మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సీఎస్‌ఆర్ నిధులతో బాగా వెనుకబడిన గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులకు ఆర్ కార్డులు మంజూరు చేసి, వారందరికీ ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమస్య రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, పర్యావరణానికి ఈ ప్రాంత మత్స్యకారులకు చేపల వేటకు ఎటువంటి విఘాతం హానీ కలగకుండా చర్యలు చేపట్టాలని, ఈవిషయంపై ప్రజాభిప్రాయసేకరణలో స్పష్టమైన ప్రకటన చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. స్టీల్‌ప్లాంట్ కారణంగా గ్రామాల్లో ఉపాధి కోల్పోయిన రైతులు, వివిధ రకాల చేతివృత్తులవారికి ,అనుబంధ రంగాల వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించాలని ఆయా వర్గాల వారు కోరుతున్నారు.

భారీ బందోబస్తు

ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్ద డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు కుమారస్వామి, అప్పన్న, రామకృష్ణల ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. స్టీల్‌ప్లాంటు ఏర్పాటును వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టు నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. బల్క్ డ్రగ్‌పార్క్‌ను వ్యతిరేకిస్తూ రాజయ్యపేటలో మత్స్యకారులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో మరింత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మాజీ డిప్యూటీ సీఎం బూడిని కలిసిన బొడ్డేడ



తారువలో పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్‌ను సత్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడును ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులైన సందర్భంగా తారువలో ఆయనను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ముత్యాలనాయుడు, బొడ్డేడ ప్రసాద్ పరస్పరం ఒకరినొకరు శాలువాలతో సత్కరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ బొడ్డేడకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తదితర పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 31.8 నుంచి 32.7 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.3 నుంచి 25.7 డిగ్రీలు నమోదు కావచ్చన్నారు.

కొనసాగుతున్న నిరాహారదీక్ష



రాజయ్యపేటలో నిరహారదీక్ష కొనసాగిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్‌పార్క్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న నిరాహారదీక్ష శుక్రవారం 12రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మత్స్యకారులు తమ ఆరాధ్యదైవం నూక తాత ఆలయం వద్ద ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసి దీక్ష కొనసాగించారు. బల్క్ డ్రగ్‌పార్క్ పనులు అడ్డుకునేందుకు రోడ్డుపై మత్స్యకారులు ధర్నాకు దిగారు. అసెంబ్లీ అయిన వెంటనే వచ్చి గ్రామస్తులతో మాట్లాడతానని హోం మంత్రి వంగలపూడి అనిత వీడియో సందేశం పంపించడంతో ధర్నా విరమించి, నూకతాత ఆలయం వద్ద దీక్ష కొనసాగిస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లో బల్క్ డ్రగ్‌పార్క్ రద్దుచేయాల్సిందేనని వారు పట్టుబడుతున్నారు. దీక్షకు వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజులు మద్దతు తెలిపి, మత్స్యకారులతోపాటు దీక్షలోకూర్చొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే బల్క్ డ్రగ్‌పార్క్ రద్దుచేసే వరకుపోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూరాకాసుల గోవిందు, గంటాతిరుపతిరావు, గొర్ల గోవిందు, మాజీ ఎంపీటీసీ పిక్కి తాతీలు,ఎరిపిల్లి నాగేశు, మహిషే, సూరిబాబు,కాశీరావు,సోమేష్, రాజశేఖర్, నూకరాజు,యజ్జల అప్పలరాజు,పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లతో దుర్గమ్మకు అలంకరణ

మాకవరపాలెం: లక్ష్మీదేవి అవతారంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి అమ్మవారు దర్శనమిచ్చారు. దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల దుర్గామల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన శుక్రవారం అమ్మవారితోపాటు ఆలయంలో రూ.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించినట్టు ఆలయ అర్చకులు మల్లికార్జునశర్మ తెలిపారు. దుర్గామల్లేశ్వర అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వడంతో కనులారా వీక్షించి పూజలు చేశారు.



లక్ష్మీదేవి అవతారంలో దుర్గామల్లేశ్వర అమ్మవారు

చిట్టీల కేసుపై డీఎస్పీ విచారణ



కె.కోటపాడు పోలీస్‌స్టేషన్‌లో వాంగ్మూలం నమోదు చేస్తున్న డీఎస్పీ శ్రావణి

కె.కోటపాడు: ఇటీవల చౌడువాడలో చిట్టీల పేరుతో మోసానికి పాల్పడిన పెదిరెడ్డి పద్మజపై ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం కె.కోటపాడులో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి విచారణ జరిపారు. ఫిర్యాదుదారులైన గోలగాని మురళీతో పాటు మరికొందరి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రావణి మాట్లాడుతూ ఈ కేసులో సాక్షుల వాంగ్మూలాలు, సేకరించిన ఆధారాలను కోర్టుకు సమర్పించనున్నట్టు తెలిపారు. అక్రమంగా నిర్వహించే చిట్టీలలో ఎవరూ పెట్టుబడులను పెట్టరాదని ఆమె తెలిపారు. చట్ట విరుద్ధంగా చిట్టీలు నిర్వహించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. చిట్టీల నిర్వహణ గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందజేయాలని డీఎస్పీ శ్రావణి కోరారు.

ట్యాంకర్ల నుంచి పెట్రోల్, డీజిల్ చోరీ

నలుగురు నిందితులపై కేసు నమోదు



పెట్రోల్,డీజిల్ చోరీ చేస్తున్న నిందితులతో పోలీసులు

యలమంచిలి రూరల్: యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి సోమన్నపాలెం వద్ద కొంతకాలంగా డీజిల్,పెట్రోల్ ట్యాంకర్ల నుంచి ఇంధనం దొంగలిస్తున్న నలుగురిని యలమంచిలి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సోమన్నపాలెం సమీపంలో పాత జాతీయరహదారి పక్కన ఎస్.రాయవరం మండలం వొమ్మవరానికి చెందిన షేక్ జానీ ఒక షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడ అక్రమంగా ట్యాంకర్ల లోంచి డీజిల్,పెట్రోల్ చోరీ చేస్తున్నారు.ట్యాంకర్లకు ఉన్న సీలు తొలగించకుండా చాకచక్యంగా తాళం తెరిచి ఇంధనం చోరీకి పాల్పడుతున్నారు.ఈ సమాచారం అందుకున్న యలమంచిలి రూరల్ పోలీసులు శుక్రవారం అక్కడకు వెళ్లి పరిశీలించి, డీజిల్ చోరీ చేస్తుండగా నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీజిల్ లోడుతో రాంబిల్లి ఐవోసీఎల్ నుంచి తూర్పుగోదావరి జిల్లా ఎర్రవరానికి వెళుతున్న ఏపీ39 యూ1389 నంబరు గల ట్యాంకర్‌ను సోమన్నపాలెం వద్ద ఆపి డీజిల్ చోరీ చేస్తుండగా నిందితులను పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో ట్యాంకర్ డ్రైవర్, క్లీనర్, మరో ఇద్దరు ఉన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఇన్‌చార్జ్ ఎస్ఐ కె. సావిత్రి తెలిపారు. నిందితుల వద్ద నుంచి 20 లీటర్ల డీజిల్, 50 లీటర్ల పెట్రోల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సన్యాసిపాత్రుడ్ని పరామర్శించిన కేకే రాజు



మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడ్ని పరామర్శిస్తున్న కేకే రాజు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, విశాఖ ఉత్తర, తూర్పు నియోజకవర్గం పరిశీలకులు చింతకాయల సన్యాసి పాత్రుడు అనారోగ్య కారణంతో మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.దీంతో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేకే రాజు వెంట ఉత్తరాంధ్ర జోనల్ ప్రెసిడెంట్స్ అంబటి శైలేష్, ముత్తి సునీల్ కుమార్, జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షులు గాలి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

30.5 కిలోల గంజాయి స్వాధీనం



తాళ్లపాలెం వద్ద పోలీసులు పట్టుకున్న గంజాయి, నిందితుడు

కొంకోట: మండలంలోని తాళ్లపాలెం సంత ప్రాంతంలో ఉన్న గంగాదేవి గుడి వద్ద కారులో తరలిస్తున్న 30.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ యువకుడి అరెస్టు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం తెలిపారు. మరొకరు పరారైనట్టు చెప్పారు. తాళ్లపాలెం సంత వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో వచ్చిన కారును పరిశీలిస్తుండగా దానిలో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించినట్టు సీఐ తెలిపారు. అనుమానంతో కారు డిక్కీ తెరచి చూడగా 5 ప్యాకెట్లలో 30.5 కిలోల గంజాయి లభించినట్టు చెప్పారు. దీని విలువ రూ.3.05 లక్షలు ఉంటుందన్నారు. ప్రధాన నిందితుడైన మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం గ్రామానికి చెందిన మురుకుట్టి ఈశ్వర్ సాయి సతీష్(24)ను విచారించగా మరికొంత మంది ఈ వ్యవహారంలో ప్రధాన పాత్ర వహించినట్లు తెలిపారన్నారు. వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ చెప్పారు. సతీష్ గతంలో రెండు గంజాయి కేసుల్లో నిందితుడని తెలిపారు. గంజాయి, కారును స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

డి-పట్టా భూములను వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయాలి



ఒమ్మలిలో మెడకు ఉరితాళ్లు వేసుకుని ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు



కొమిర సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

మాడుగుల రూరల్/రావికమతం: రావికమతం మండలం ఉరవలోవ రెవెన్యూ పరిధిలో డి- పట్టా భూములను వెబ్ ల్యాండ్ రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన రైతులు శుక్రవారం రావికమతం మండలం కొమిర గ్రామ సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేయగా, మాడుగుల మండలం ఒమ్మలిలో మెడకు ఉరితాళ్లు వేసుకుని ఆందోళన చేశారు. ఒమ్మలిలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షురాలు కార్లె భవానీ, గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇ.నర్సింహమూర్తి మాట్లాడుతూ 2016-17 సంవత్సరంలో 6వ విడత భూ పంపిణీలో రావికమతం, వి.మాడుగుల మండలాల సరిహద్దులోని ఉరవలోవ కొండ ప్రాంతంలో ఈ రెండు మండలాలకు చెందిన ఒమ్మలి, వీజేపురం, కృష్ణాపురం, కొమిర, మత్స్యపురం, బుడ్డిబంద గ్రామాలకు చెందిన వారికి పట్టాలిచ్చారని చెప్పారు. ఈ భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయకపోవడంతో లబ్ధిదారులు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్థిక పరమైన ప్రయోజనాలు పొందలేకపోతున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలు వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై పలు మార్లు తహసీల్దార్లు, కలెక్టర్‌కు అర్జీలు అందజేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ సమస్యపై ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే తమకు ఉరితాళ్లే శరణ్యమని చెబుతూ లబ్ధిదారులు మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. కొమిర సచివాలయం వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ డి-పట్టా భూముల్లో గిరిజన రైతులు జీడి తోటలు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒమ్మలిలో జరిగిన కార్యక్రమంలో ఇలక అచ్చియ్యమ్మ, తట్ట వెంకటలక్ష్మి, తాటి కొండ చిన నాగరాజు, రాచర్ల సూరిబాబు, పైలా అప్పలనర్సమ్మ, కొండమ్మ పాల్గొన్నారు. కొమిర గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గిరిజన సంఘం కార్యదర్శి రాజు,వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి దేముళ్లు, అప్పలనాయుడు, గిరిజన సంఘం నాయకులు సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



రోటరీ క్లబ్ అందించే ప్రోత్సాహక సర్టిఫికెట్లతో ఉత్తమ విద్యార్థినులు

అనకాపల్లి టౌన్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని స్టేట్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ పి.కృష్ణారావు సూచించారు. స్థానిక రోటరీ బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ మంత్‌లో భాగంగా కొణతాల రామునాయుడు జయంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ఉత్తమ విద్యార్థులకు సుమారు లక్ష రూపాయల ప్రోత్సాహక నగదు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ప్రతి ఏడాది రోటరీ క్లబ్ అందిస్తున్న స్కాలర్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బుద్ద శ్రీనివాసరావు, చైర్మన్ బి.ఎస్.గుప్తా, రవిరామ్, కుష్వంత్, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారాలు చేసుకునే నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయడం తగదని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయ ఉద్యోగికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల్లో దసరా సమీపిస్తున్నా ఆ ఆనందం చిరువ్యాపారుల్లో లేదన్నారు. ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న రాజకీయ నేతల కటౌట్లు, సెల్లార్లు వదిలిపెట్టకుండా వ్యాపారాలు చేస్తున్న పెద్ద వారిని వదిలి చిరు వ్యాపారులను ఇబ్బందులు పెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వనమాల నాగభూషణం, కొల్లి చిన అప్పారావు, కొల్లి సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న గొర్రెల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు గంటా శ్రీరామ్

అనకాపల్లి టౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను గొర్రెల పెంపకం దారులకు మంజూరు చేయాలని గొర్రెల పెంపకందార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ప్రతి గొర్రెకు రూ.10వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. వర్షాకాలంలో వివిధ వ్యాధులతో గొర్రెలు, మేకలు మృతి చెందుతున్నాయని, వ్యాక్సిన్ ఉచితంగా వేసే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బి శ్రీనివాసరావు, రాజశేఖర్, పినబోయిన అప్పారావు యాదవ్, గోకాడ దేముడునాయు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 118 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	5,000
రెండో రకం	3,800	4,010
మూడోరకం	3,650	3,650

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఓజీ
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురం
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18, బీ పాజిటివ్-20, ఓ పాజిటివ్-33, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.



మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ



కశింకోట కనకదుర్గ ఆలయంలో కరెన్సీ నోట్ల అలంకరణలో దుర్గమ్మ



కశింకోట శివాలయంలో ప్రత్యేక అలంకరణలో సర్వమంగళాంబ



కుక్కుటేశ్వరిదేవి అలంకరణలో గౌరీ దేవి



రాజరాజేశ్వరి దేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



అన్నపూర్ణదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ

లోకజనని.. కరుణ రూపిణి

- వైభవంగా శరన్నవరాత్రుల ఉత్సవాలు
- పల్లెల్లో ప్రత్యేక పీఠాల్లో దుర్గమ్మకు పూజలు
- మార్మోగుతున్న జైభవానీ నామస్మరణ

తుమ్మపాల: పల్లెల్లో జైభవానీ నామస్మరణ మార్మోగుతోంది. దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఎక్కడికక్కడ ప్రత్యేక పీఠాలు ఏర్పాటు చేసి దుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణం, పల్లెలు తేడా లేకుండా భక్తులు వందల సంఖ్యలో భవానీమాలలు ధరించి నిత్య భజనలతో పూజలు చేస్తూ అమ్మవారి శరణు ఘోష చేస్తున్నారు. ఒకప్పుడు ఆలయాల్లోనే చేపట్టే నవరాత్రుల పూజలు ఇటీవల ప్రతి పల్లెలోను, వీధుల్లోను ఘనంగా చేస్తున్నారు. ఈ నెల 21న మొదలైన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో భవానీ స్వాములు భజనలతో పీఠాల వద్ద పూజలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో కనీసం 200 నుంచి 300 మంది వరకు భవానీ మాలలు ధరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్నారు.

పలువురు భక్తులు తమ ఇళ్ల వద్ద శక్తికి తగ్గట్టు అంబలం పూజ చేస్తున్నారు. మండలంలో సత్యనారాయణపురం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గవరపాలెంలో సతకంపట్టు శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ప్రతి రోజు 1500 మంది భవానీ భక్తులకు అన్నదానం చేస్తున్నారు.



దుర్గమ్మకు భజనలు చేస్తున్న భవానీభక్తులు

కరెన్సీ నోట్ల అలంకరణలో దుర్గమ్మ

కశింకోట: దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు దుర్గమ్మ మహాలక్ష్మి అమ్మవారుగా దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు కనువిందు చేశారు. స్థానిక జాతీయ రహదారి వద్ద ఉన్న కనకదుర్గమ్మను రూ.10, రూ.20 కరెన్సీ నోట్లతో అలంకరించి సహస్ర నామాలతో కుంకుమార్చనలు చేశారు. కశింకోట శివాలయంలో సర్వమంగళాంబను మహాలక్ష్మి దేవిగా అలంకరించి రూ.10 కరెన్సీ నోట్లతో అందంగా ముస్తాబు చేశారు.

అనకాపల్లి: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం దుర్గాదేవి అమ్మవారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక



తుమ్మపాలలో దీపాలంకరణతో దుర్గమ్మ చిత్రం

మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. హైమావతి శిష్య బృంద సభ్యులు శాస్త్రీయ, జానపద నృత్యాల ప్రదర్శనలతో అలరించారు.

- స్థానిక నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయంలో అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.
- స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మవారు.. అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భవానీ భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై పట్టణంలో పురవీధుల్లో ఊరేగించారు.



అన్నపూర్ణదేవి అలంకరణలో ఉన్న కామాక్షిదేవికి పూజలు చేస్తున్న భక్తులు

- స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న కనకదుర్గమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో మాతృ తయోరాధన, చండీ హోమం నిర్వహించారు. సుమారు 1500 మంది భవానీ భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.
- స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో గౌరీదేవి.. కుక్కుటేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధారాణి



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కళాకారుల నృత్య ప్రదర్శన

బొడ్డేడ ప్రసాద్‌కు అభినందనల వెల్లువ

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయనను పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా బొడ్డేడ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాటలు సభ్యసమాజానికి సిగ్గుపడేలా ఉన్నాయన్నారు. సినీనటుడు చిరంజీవిపై అహంకారంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెట్టిన భిక్షతో బాలకృష్ణ ఇప్పటికీ జీవిస్తున్నారని, ఆ సంగతి మరిచిపోకూడదన్నారు. మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో బ్రీత్ ఎనలైజర్ మిషన్లు పెట్టే పరిస్థితిని తీసుకువచ్చేలా బాలకృష్ణ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బాలకృష్ణ లాంటి సైకోతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సినీ నటుడు చిరంజీవిని హేళన చేస్తూ అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, నూకాంబిక అమ్మవారి దేవాలయం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బొడ్డేడ ప్రసాద్, మలసాల భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



బెల్లం మార్కెట్‌లో శుభ్రం చేస్తున్న గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు

అనకాపల్లి: పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ సతీష్ చంద్ర అన్నారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో పరిశుభ్రత అత్యంత కీలకమన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ శుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



గవరపాలెం పార్కు సెంటర్ వద్ద కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భరత్‌కుమార్



వేల్పులవీధి రజకుల కాలనీలో 50 వసంతాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: మానసిక ప్రశాంతత కోసం యువత ఆధ్యాత్మికత బాట పట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సూచించారు. పట్టణ, మండలంలో ఏర్పాటు చేసిన పలు దేవీ శరన్నవరాత్రుల పందిళ్ల వద్దకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వేల్పులవీధి రజకుల కాలనీలో కనకదుర్గమ్మ ఆలయం నిర్మించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా స్థానిక రింగ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే కొత్తూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ 12వ వార్డు మెంబర్ ఆర్యా సోమాధుల శివ తల్లిని ఆయన పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీతానగరం మాజీ సర్పంచ్ కొత్తపలి శ్రీనును కూడా భరత్‌కుమార్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్ రాజా, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80వ వార్డు ఇన్‌ఛార్జ్ కె.ఎం.నాయుడు, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, మండల యువజన విభాగం అధ్యక్షుడు బాదపు హరికృష్ణ, కొత్తూరు ఎంపీటీసీ శ్రీను, పార్టీ నాయకులు దాడి నారాయణ రావు, దండ జ్ఞానదీప్, కాండ్రేగుల హైమా, ఉగ్గిన శ్రీనివాసరావు, అల్లు త్రినాథ్, పీడీ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమి పూజ

అనకాపల్లి: స్థానిక 82వ వార్డు గాంధీనగరం-1, బర్మాకాలనీ, విజయరామరాజుపేటలో సుమారుగా రూ.60 లక్షల నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శుక్రవారం కార్పొరేటర్ మందపాటి సునీత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో వార్డులో సుమారు రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం చేపట్టే అభివృద్ధి పనులకు జోనల్ ఇంజినీరింగ్ సిబ్బందికి ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలన్నారు. చేతి బోరు మూడు నెలలుగా పనిచేయడంలేదని, తాగునీటి కుళాయిలు ద్వారా పరిశుభ్రమైన నీటిని అందించాలని కార్పొరేటర్ సునీతను విజయరామరాజుపేట ప్రజలు కోరారు. రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మాజీ వైస్ చైర్మన్ పలకా సత్యనారాయణ, పార్టీ నాయకులు మునూరు శ్రీనివాసరావు, గైపూర్ రాజు, కొండు రవీంద్రనాథ్, శేషగిరి, ఆకుల సంతోష్, కోన ఉమా, జీవీఎంసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



82వ వార్డు గాంధీనగరం-1 వీధిలో భూమి పూజ చేస్తున్న 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో గృహ, వ్యవసాయ కనెక్షన్లకు శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ కశింకోట డివిజన్ ఏఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. హెచ్‌టీ, ఎల్‌టీ లైన్ల కింద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా కొత్తూరు, సత్యనారాయణపురం, మూలపేట, వేట జంగాల పాలెం, సంపతిపురం, కూండ్రం, కుంచంగి, రొంగలివాని పాలెం, పిసినికాడ గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

నేడు 'డిజిటల్ బుక్' పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'డిజిటల్ బుక్'పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఇతర నియోజకవర్గ సమన్వయకర్తలు విచ్చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఉచిత వినికిడి మిషన్ల నమోదు శిబిరం

అనకాపల్లి టౌన్: స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో బీజేపీ, దీన్ దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వినికిడి మిషన్ల నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య నిపుణులు రవితేజ, ఆడియోలాజిస్ట్ రాజు, టెక్నీషియన్ అరుణ్, ఆడియో మైత్రీషన్ గోపిక బాధితులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్, కె.తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వినికిడి మిషన్ల కోసం వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆలోచింపజేసిన 'విడాకులు కావాలి' నాటిక

అనకాపల్లి: స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం పార్కు సెంటర్ వద్ద శుక్రవారం రాత్రి ప్రదర్శించిన నాటికలు అలరించాయి. వల్లూరి శివప్రసాద్ రచించగా.. గంగోత్రి సాయి దర్శకత్వం వహించిన విడాకులు కావాలి నాటిక ఆద్యంతం ఆలోచింపజేసింది. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ బేధాలు, అపోహాలు, చిన్నచిన్న సమస్యలు సహజం. అంతమాత్రం చేత కలిసి బతకలేమన్న తొందరపాటుతో, పంతాలకు పోయి విడాకులు కావాలనుకోవడం ఎంత వరకు సమంజసం. భార్యాభర్తలు మనసు విప్పి మాట్లాడుకోవడం, పని విభజన చేసుకుని పరస్పరం సహకరించుకోవడం, అపార్థాలకు తావులేకుండా చూసుకోవడం, అహంకారంతో పట్టుదలలకు పోకుండా, సర్దుబాటు ధోరణితో సంయమనం పాటించడం వల్ల ఆదర్శ దంపతుల్లా గడపొచ్చు. భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతీ, సంప్రదాయాలే అన్యోన్యంగా నడిపే దారిదీపాలు అంటూ ఇతివృత్తంతో సాగిన ఈ నాటికను కళాకారులు చక్కగా ప్రదర్శించి మెప్పించారు.




విడాకులు కావాలి నాటికలో ఓ సన్నివేశం

భువి కోరని భ్రమణం

భూమి కంటే ముందే అమ్మ మనకి తన గర్భంలో చోటిచ్చి మోస్తుంది. జన్మనిస్తుంది. భూమికంటే అమ్మే గొప్పది. భూమిని ఎంత తవ్వినా ఎప్పుడూ అడ్డుచెప్పదు. అలాగే కన్నతల్లిచే బిడ్డలు ఎంత శ్రమ చేయించుకున్నా అవమానించినా అమ్మకి కష్టం అనిపించదు. అడ్డు చెప్పదు. అలాగని ఇంకెన్నాళ్లు కష్టపెడతాం తప్పు కదా.. గర్భ గుడిలో ఉండే దేవతలాంటి అమ్మ ఇంటింటికి తిరగకూడదు. బిడ్డలే వచ్చి చూసి పోతుండాలి. బలవంతంగా గ్లోబును తిప్పనట్లు గిరగిరా తిప్పకూడదు. అది సృష్టి విరుద్ధం. అందుకే ఇలాంటి బలవంతపు భ్రమణాలను ఏ తల్లి కోరుకోదు. భువి కోరని భ్రమణాన్ని బిడ్డలే అర్థం చేసుకుని ఆపేయాలి. ఎంత కొలిచినా తరగని ఆకాశం.. ఎంత కొలిచినా తీరని రుణం అమ్మతనం. అమ్మను దర్శించండి.. పూజించండి.. ఆశీర్వాదం పొందండి.. తరించండి.. అని సందేశంతో సాగే భువి కోరని భ్రమణం నాటిక ఆహూతల కరతాళ ధ్వనులు అందుకుంది. మూల కథ ఆచాళ్ల ఉమా మహేష్ కాగా.. రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మవారి ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, నాటికల నిర్వాహకులు కె.ఎం.నాయుడు, కర్రి సన్యాసినాయుడు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ పరిశ్రమల్లో కెమికల్స్ వినియోగంపై అవగాహన

పరవాడ: ఔషధపరిశ్రమల్లో మిథనాల్, ఇథనాల్ వంటి కెమికల్ వినియోగం, రవాణాపై ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించాలని విశాఖపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. జేఎన్ ఫార్మాసిటీలో ఎంఏఎస్ఆర్ఎం కార్యాలయంలో ఫార్మాసిటీ పరిశ్రమల సిబ్బందికి శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మిథనాల్, ఇథనాల్‌ను ఉపయోగించే సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవగాహన సదస్సుకు వివిధ ఫార్మా పరిశ్రమలకు చెందిన 90 మంది సిబ్బంది హాజరయ్యారు. సదస్సులో అనకాపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంటు కమిషనర్ సీహెచ్‌వీ మహేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్, ఎక్సైజ్ అధికారులు బి.ఈశ్వరరావు, అనకాపల్లి టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.సురేష్, సబ్బవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్, ఎస్ఐ వీవీ రమణ పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

కానరాని అభివృద్ధి జాడ

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా పట్టణంలో ఎక్కడా అభివృద్ధి జాడ కనిపించడం లేదని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. పట్టణ ప్రజలకు తాగడానికి నీరుకూడా లేకుండా పోయిందన్నారు. గంట మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారని, ఇది ప్రజలకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఇక కరెంట్ ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. జీవీఎంసీ కార్యాలయంలో సిబ్బంది లేరని స్వయంగా ఎమ్మెల్యే కొణతాల అసెంబ్లీలో చెప్పడం చూస్తుంటే ఇక్కడ ఎంత స్థాయిలో అభివృద్ధి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇకనైనా పాలకులు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.

165 మందికి వైద్య పరీక్షలు

కశింకోట: స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా బయ్యవరంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు 165 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పరవాడ: నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై రాకపోకలు సాగించడం ప్రమాదకరమని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. లంకెలపాలెం వంతెనపై నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఇలాంటి ప్ర యాణాల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులను హెచ్చరించారు.